వ్యక్తిగత చైతన్యానికి, వాస్తవికతకు మధ్య నలిగిపోతున్న
కొందరి జీవితాల్లోని దుఃఖమే ఈ కథకు ప్రేరణ.

జి. లక్ష్మి

# 3

# ఇరవై ఒకటో వాడు





ఆయన రెండు కాళ్లు పైకెత్తి సోఫాలో బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు. ఐశ్వర్య అల్లిన మల్లెపూవు లాంటి సోఫా కవర్‌పై లేత ఎరుపురంగు మట్టిచార. గీసుకోని గడ్డం, మాసిన లాల్చీ పైజమా, తైల సంస్కారం లేని జుట్టు, నాలుకకీ మెదడుకీ మధ్య లోపించిన సమన్వయంతో తడబడే మాటా- ఒకలాంటి విషాదం ఆయన చుట్టూ. ఆయన దగ్గర ఒకరకమైన ముసలివాసన. ఆలనా పాలనా పట్టించుకునేవాళ్లు లేక, శరీరం మీద శ్రద్ధ పోయి ఏ పని చేయడానికి కూడా శరీరం సహకరించని దుర్బలత్వం తాలూకూ ముసలి వాసన అది. తెల్లటి లాల్చీ పైజమాలో తెల్ల పావురంలా వుండే ఆయన్ని ఇలా చూస్తూంటే ఒక రకంగా బాధగా వుంది.

ఆయన శబ్దం చేస్తూ కండువాలోకి చీదాడు. డైనింగ్ టేబిల్ దగ్గర గిన్నెలు సర్దుతున్న ఐశ్వర్య నావంక ఎర్రగా చూసింది. ఆమె చూపుల్ని గమనించనట్టు చూపు తప్పించాను. పాప ఆయన వంకే వింతగా ఆసక్తితో చూస్తోంది. చాలాకాలం తర్వాత కలవడం వల్లనేమో ఏం మాట్లాడాలో తోచనితనం ఇద్దరి మధ్యా.

“అయితే మొత్తానికి హైదరాబాదులోనే ఉన్నావన్నమాట,” మౌనాన్ని మాష్టారే కదిలించారు. అవునన్నట్టు తలూపాను. మాష్టారు హాలంతా కలయజూస్తుంటే నేనూ అటే చూపుల్ని పోనిచ్చాను. టీపాయ్ మీద ఫెంగ్‌షుయ్ బాంబూ ట్రీ. నేనున్న సేఫ్‌జోన్ చెదరకుండా ఐశ్వర్య చేసిన ఏర్పాటు. దాని పక్కనే గంటల పంచాగం. హాలుకి ఒక మూల దేవుడి మందిరం. గోడకి దేవుళ్ల పటాలు. ఆయన ఒక్కొక్కదాన్ని చూస్తున్నకొద్దీ నా మొహం నల్లగా అవడం నాకు తెలుస్తోంది.

రామచంద్ర మాష్టారింట్లో నేను నేర్చుకున్నదానికీ ఇప్పుడు నా జీవిత విధానానికీ ఏ మాత్రం లేని పొంతన నన్ను ఇబ్బంది పెడుతోంది. వ్యక్తుల కారణంగా దేని విలువ అయినా పెరగడం తగ్గడం అనేది ఉంటుందని అప్పటివరకూ నాకు తెలీదు. ఆయన ఇంటిని పరీక్షగా చూస్తున్నకొద్దీ నా మొహం అవమానంతో నల్లగా అవుతోంది. ఇంటి ముందు కారు ఆగగానే డ్రైవర్ పరిగెత్తుకువచ్చి డోర్ తెరిచినప్పుడు మొదలైన ఆ నలుపు ఉన్నకొద్దీ మొహానికి మసి పూసినట్టు దట్టంగా

అలుముకుంటోంది. ఆ నలుపు ఇప్పటిదా? నా భుజాల చుట్టూ వేసిన ఆయన చేతిని తప్పించుకుని నేను సేఫ్ జోన్‌లో అడుగుపెట్టినప్పుడే బహుశా అది కూడా మొదలయిందేమో?

ఆయన మళ్లీ కండువాలోకి గట్టిగా చీదాడు. ''భోజనం వడ్డించమంటారా?'' ఇంక దీన్ని ఎక్కువసేపు భరించలేననే తొందర ఐశ్వర్య గొంతులో. మాష్టారింట్లో నేను రెండేళ్లపాటు ఉన్నానని చెప్పినమాట గొంతుకు ఆ మాత్రం మెత్తదనాన్ని ఇచ్చిందని నాకు తెలుసు. తెల్లటి సోఫా కవరుపై నల్లటి మురికి మచ్చలా ఉన్న ఆయన్ని ఎవరు మాత్రం ఎక్కువసేపు భరించగలరు?

హాస్పిటల్‌లో చూసినాయన్ని చూసినట్టు వదిలేయకుండా ఇంటికి తీసుకు వచ్చి పొరపాటు చేశానా అనిపించింది ఒక్క క్షణం. మరుక్షణం నా ఆలోచనకు నాకే సిగ్గనిపించింది. చలికి ముడుచుకుపోయి సోఫాలో ఒకమూల ఒరిగిపోయిన ఆ ఎముకల పోగును  ఒక కన్ఫెషన్ బాక్సులా చూస్తున్నందుకు నామీద నాకే కంపరంగా అనిపించింది.

''సుభద్ర నిన్ను చాలాసార్లు తల్చుకునేది,'' భోజనాలు అయిన తర్వాత పక్క అమర్చి గదిలో నుంచి వచ్చేస్తుండగా మాష్టారు తనలో తను అనుకుంటున్నట్టుగా అన్నారు.

గుండెల్లో ఎక్కడో ఏదో పట్టుకున్నట్టయింది. నాకు తెలియకుండానే కళ్లల్లో సన్నటి నీటిపొర.

''ఒక్కసారి నువ్వు తనకి కనిపించి వుంటే బాగుండేది.''

ఆయన గొంతులో ఎలాంటి నిష్ఠూరం లేదు. మామూలుగా ఉంది. కానీ అది నా గుండెలో ముల్లులా గుచ్చుకుంది.

'ఒక్కసారి కనిపించి ఉంటే బాగుండేది'... 'ఒక్కసారి కనిపించి ఉంటే'... సుభద్రా మేడమ్. క్యాన్సర్‌తో చనిపోయిన సుభద్రా మేడమ్ ఏం తల్చుకుని ఉండి ఉంటుంది నన్ను? ఆహా రెక్కల గుర్రం మీద భలేగా ఎగిరిపోయాడే అనుకుని ఉంటుందేమో... నిజమే సుభద్రా మేడమ్‌కు ఒక్కసారన్నా కనిపించి ఉండాల్సింది. కానీ ఏదో గిల్టీ ఫీలింగ్. ఎప్పటికప్పుడు వెళదామనుకుంటూనే వెళ్లలేని గిల్టీఫీలింగ్. నన్ను కప్పేసిన ఆ అవమానపు తొడుగు. అలా అని వాళ్లు నా నుంచి ఆశించిందీ ఏదీలేదు. వాళ్లకు నేను చేసిన వాగ్దానమూ ఏదీలేదు. కానీ ఆ ఉన్నదేదో లేనిదేదో ఆ రహస్య ఒప్పందం ఏదో మా ముగ్గురి మనసులకే తెలుసు.

డిగ్రీ ఫస్టియర్‌లో కాలేజీ వార్షికోత్సవాల కోసం డిబేటులో మాట్లాడినప్పుడు సుభద్రా మేడమ్‌తో మొదటిసారిగా పరిచయం అయింది. స్టేజీ దిగి కిందకు వచ్చిన తర్వాత బాగా మాట్లాడావని సుభద్రా మేడమే నన్ను అభినందించింది. ఒక ఆదివారం

ఎప్పుడన్నా వాళ్ల ఇంటికి రమ్మనమని చెప్పింది. ఆ ఒక ఆదివారం నా జీవితాన్ని ఒక మలుపు తిప్పబోతోందని అప్పుడు నాకు తెలీదు.

ఒక ఆదివారం వాళ్ల ఇంటికి వెళ్లాను. వాళ్ల ఇల్లు మా ఇంటిలా లేదు. ఆ మాటకు వస్తే నాకు తెలిసిన ఏ ఇంటిలానూ లేదు. ఆ ఇల్లు నా కళ్లపై ఓ కొత్త ప్రపంచపు మాయామోహపు జలతారును సుతారంగా కప్పింది. ఓ సరికొత్త సాహితీ లోకానికి తలుపులు తెరిచింది. ఆ ప్రపంచం నాలో కొత్తకొత్త ఆలోచనలను రేకెత్తిం చింది. ఉద్వేగంతో కంట తడిపెట్టించింది. ఆవేదనలో అశాంతిలో ముంచి ఎన్నో నిద్రలేని రాత్రుళ్లని రుచి చూపించింది. రకరకాల ఉద్రిక్తతలతో, ఆవేశంతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. నేను నేనుగా కాకుండా ఒక సరికొత్త నేనును ఆవిష్కరించింది. ఒక మిథ్యా ప్రపంచం నుంచి నన్ను వేరు చేసుకునేలా చేసింది.

సుభద్రా మేడమ్, రామచంద్ర మాష్టారు వాళ్ల ఇంటికి రచయితలు, స్నేహితులు ఎవరెవరో వచ్చిపోతుండేవాళ్లు. చాలా త్వరలో నేను కూడా వాళ్లలో ఒకడిగా అయిపోయాను. వాళ్లకి పిల్లల్లేరు. ఇంటికి ఎవరన్నా వస్తే రామచంద్ర మాస్టారు నా భుజాల చుట్టూ చేయి వేసి 'మా అబ్బాయి,' అని చెప్పేంత అభిమానాన్ని సంపా దించుకున్నాను. ఆ రెండు మూడేళ్లు నేను మా ఇంట్లో ఉన్నది తక్కువ. మాష్టారింట్లో ఉన్నది ఎక్కువ.

మొదట్లో కొంత కాలంపాటు మాట్లాడకుండా బిడియంగా ఒక పక్కన కూర్చునే వాడిని. క్రమంగా మాట్లాడడం మొదలుపెట్టాను. మిగిలిన వాళ్లతో పాటు రోడ్లమీద నినాదాలు చేస్తూ తిరగాలన్నా, ఏదన్నా మీటింగుల కోసం చందాలు అడగడానికి షాపులకి వెళ్లాలన్నా మొదట్లో మొహమాటంగా అనిపించేది. రాను రాను అలవాట యింది.

ఆ రెండేళ్లు సత్రం భోజనం, మఠం నిద్ర అన్నట్టు ఉండేది నా పని. తినడానికి పడుకోడానికీ కూడా ఇంటికి వస్తే వచ్చేవాడిని. ఎవరన్నా వస్తే, ఏదన్నా చర్చలో పడిపోతే ఇంక సుభద్రా మేడమ్ వాళ్ల ఇంట్లోనే తిని పడుకునిపోయేవాడిని. తెల్లవారి లేచి ఇంటికి వచ్చేవాడిని. నాన్న ఏమనలేక చూస్తుండిపోయేవారు.

''ఏది తయారు చేయడానికైనా వాడేది మైనపుముద్దనే. అది ఏ రూపం తీసుకోవాలి అనేది నిర్ణయించుకోవలసింది ఎవరికి వాళ్లే,'' సుభద్రా మేడమ్ అంది ఒకసారి. నేను కూడా ఒకప్పుడు మైనపుముద్దనే. ఆ రెండేళ్లలోనే నేను కూడా ఒక రూపం తీసుకున్నాను.

ఫైనలియర్ ఎగ్జామ్స్ రాశాను. ఆ పరీక్షలు అయిపోవడం కోసమే ఎదురు చూస్తున్నాం మేమంతా. సెలవుల్లో ఏమేం చేయాలో కూడా ప్లాన్ చేసుకున్నాం. ఓరోజు సాయంత్రం నాన్న పిలిచారు.

"రవీ, నువ్వు అర్జంటుగా హైదరాబాదు వెళ్లిరావాలి బట్టలు సర్దుకో."

"ఎప్పుడు నాన్నా?"

"ఈ రాత్రికే."

"అంత అర్జంటేమొచ్చింది?"

"ఏమోరా శివన్నయ్య నిన్ను వెంటనే పంపమన్నాడు. వాడికేం అవసరం వచ్చిందో?"

"రాత్రికే వెళ్లాలా?"

"అవును. తొమ్మిదింటి బస్సుకి."

"ఇప్పటికిప్పుడు అంటే ఎట్లా నాన్నా? కొంచెం ముందు చెప్పొచ్చుగా," నాన్న మీద విసుక్కున్నాను.

"రెండు జతలు బ్యాగులో కుక్కుకుని వెళ్లడానికి ఎంత టైమ్ కావాలిరా? అన్నం తిని బయలుదేరితే సరిపోతుంది."

మర్నాడు సుభద్రా మేడమ్ గారింట్లో మీటింగుంది. అందులో ముఖ్యంగా నేనే మాట్లాడాల్సి వుంది. వాళ్లింటికి వెళ్లి ఒకసారి చెప్పి వద్దామనుకుని బయల్దేరాను.

"ఎక్కడికిరా బయల్దేరుతున్నావ్?"

"సుభద్రా మేడమ్ గారింటికి. హైద్రాబాదు వెళ్తున్నానని ఒకసారి చెప్పి వస్తాను."

"రెండ్రోజుల్లో వచ్చే భాగ్యానికి ఇప్పుడు అంత దూరం వెళ్లి చెప్పిరావడం దేనికి? మళ్లీ టైమవుతుందేమో? రేపు పొద్దున నేను చెబుతాలే. నువ్వు ముందు రెడీ అవ్వు," నాన్న మాటలతో ఆగిపోయాను.

అప్పుడు నాకు తెలీదు హైదరాబాదు వెళ్లేది రెండు రోజుల భాగ్యానికి కాదని. ఆ వెళ్లడం వెళ్లడం శివన్నయ్య బ్యాంకు పరీక్షలకు కోచింగ్ సెంటర్‌లో చేర్పించేశాడు. బ్యాంకు ఉద్యోగం నాకు ఇష్టంలేదని ఎంత మొత్తుకున్నా వినలేదు. అదంతా ఏదో కుట్రలా అనిపించింది. ఇంటికి వెళ్లిపోతానని పట్టుబట్టాను. రెండురోజుల తర్వాత నాన్న హైదరాబాదు వచ్చాడు.

నాన్న దిగులుగా ఉన్నట్టు అనిపించాడు. చాలీచాలని జీతం. రెక్కల కష్టం తప్ప ఏ ఆధారంలేని దిగులు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్ల బరువు. జీవితపు ఆటుపోట్లతో, బరువు బాధ్యతలతో అలసిపోయి వంగిపోయిన ఆయన్ని, వడలిపోయి దీనంగా ఉన్న ఆయన మొహాన్ని చూస్తూ ఆ మాట అనలేని దౌర్బల్యం ఏదో నన్నావరించింది. నేను హైదరాబాదులోనే ఉండిపోయాను. నాకూ రామచంద్ర మాష్టారి ఇంటికీ మధ్య కంటికి కనబడని ఇనుపతెర పడిపోయింది.

బ్యాంక్ పీవోగా ఉద్యోగం వచ్చి మా రీజనల్ మేనేజర్ వాళ్ల అమ్మాయితో వివాహం నిశ్చయం అయినప్పుడు ఏమైతే అదే అయింది ఇట్లా అన్నా ఆ గ్యాప్‌ను

తగ్గిద్దాం అని పెళ్లికి పిలవడానికి మేడమ్ ఇంటికి వెళ్లాను. వాళ్లు అప్పుడు నార్త్ టూర్‌లో ఉన్నారు. కలవడం కుదరలేదు. ఇంక ఆ ఇనుపతెర శాశ్వతం అయిపోయింది. నా గిల్టీ ఫీలింగ్ ఇంక మళ్లీ వాళ్లను కలిసే ప్రయత్నం చేయనివ్వలేదు.

మా మామగారు కూతురికి పెళ్లి కానుకగా మంచి ఇల్లు కట్టించి ఇచ్చాడు. గృహప్రవేశానికి వచ్చినప్పుడు ఇంటినీ పోర్టికోలో ఉన్న కారునీ చూస్తూ మా పెదనాన్న కొడుకు శ్రీను ఒక మాట అన్నాడు. వాడు నాకన్నా నాలుగేళ్లు పెద్ద. బాగా తెలివైన వాడు. చదువు మధ్యలో చెడగొట్టుకుని ఇప్పుడు ఏవేవో వ్యాపారాలంటూ కిందామీదా పడుతున్నాడు.

"మీ నాన్నకు నేనే చెప్పానురా. 'బాబాయ్! వీడిని ఇక్కడి నుంచి తప్పించి హైదరాబాదు పంపెయ్యి. ఇక్కడ ఉంటే వీడు అంకెకి రాడు,' అని . అదంతా ఒక ఊబిలాంటిదిరా. అందులో దిగడం అంటే పద్మవ్యూహంలో అడుగుపెట్టినట్టేరా చిన్నా. దాన్లో చిక్కుకుంటే ఎప్పుడు ఎలా బైటపడతామో తెలీదు. అసలు ఏమవుతామో కూడా తెలీదు. నేను కూడా ఒకప్పుడు నిన్ను మించి తిరిగినవాడినే. నాతో కలిసి ఇప్పటికి నాకు తెలిసిన వాళ్లు ఇరవైమంది అయుంటారురా చిన్నా. వాళ్లందరూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ఏమైపోయారో తెలీదు. అసలు ఉన్నారో లేదో కూడా తెలీదు. ఇద్దరో ముగ్గురో తర్వాత ఎక్కడో కనిపించారు అంతే. నువ్వు ఇరవై ఒకటోవాడివి. మాష్టారు వాళ్లకి మెరికల్లాంటి వాళ్లు కావాలి. వాళ్ల కోసం వలవేస్తూ ఉంటారు. నువ్వు వల నుంచి తప్పించుకున్నావు," శ్రీను చెబుతున్నది దేని గురించో కొంచెం కొంచెంగా అర్థమై చివరికి పూర్తిరూపం వచ్చింది. నేను అర్జెంటుగా హైదరాబాదు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ఓ మబ్బుతెర వీడినట్టు అయిపోయింది.

ఎవరైనా వల ఎందుకు వేస్తారు? మైనపుముద్దల్లాంటి పిల్లల్ని మెరికల్లా చేసి దేశానికి అప్పజెపితే వాళ్లకు వచ్చేదేంటి? అన్నిటినీ ప్రశ్నించమని నేర్పితే వాళ్లకు ఏం వస్తుంది? వలవేసి గేలం వేసి చేపల్ని పట్టి ఏం చేసుకుంటారు? అందులో ఎండే చేపలెన్ని? ఎండని చేపలెన్ని?

"వాళ్లకు వల వెయ్యాల్సిన అవసరం ఏముందిరా? దాని మూలంగా వాళ్లకు ఒరిగేది ఏంటి?"

"అవన్నీ ఇంక వద్దురా చిన్నా. వదిలెయ్. రెండిటికీ చెడిన రేవడిలా ఎదురుగుండా నేను లేనూ? నువ్వు ఒడ్డెక్కావు. నీ చెల్లెళ్లని ఒడ్డెక్కించావు. అది మాత్రం తక్కువేమీ కాదు. ఆదర్శం ఎండమావిలాంటిదిరా చిన్నా. దూరం నుంచి చూస్తే దాహం తీరుస్తుందని భ్రమింపచేస్తుంది. దగ్గరకు వెళితే గొంతు తడుపుకోడానికి కూడా గుక్కెడు నీళ్లు దొరక్కుండా చేస్తుంది," తర్వాత ఎవరో అటుగా రావడంతో సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

తర్వాత సుభద్రా మేడమ్ క్యాన్సర్‌తో చనిపోయిందని తెలిసినా మొహం చెల్లక వెళ్లలేకపోయాను.

మాష్టారి ఇంట్లో నేను గడిపిన జీవితం అంతా ఇప్పుడు ఓ అందమైన కల. ముగిసిన కల. అదంతా గత జన్మ తాలూకూ జ్ఞాపకాల సుగంధంగానే ఉండిపోయింది. ఆదర్శాలకీ, వాస్తవానికీ మధ్య ఒక దుఃఖపు మరకలా నేను మిగిలిపోయాను. అదంతా నేను మర్చిపోయాననే అనుకున్నాను. కానీ నా వైఫల్యం గుండెలోతుల్లో దాక్కునే వుంది. అది నా వెనుక వెనుక రహస్యంగా వస్తూనే వుంది. అది పైకి కనిపించే దుఃఖంకాదు. నలుగుర్లో ఉన్నప్పుడు ఆ దుఃఖం నవ్వుతూనే ఉంటుంది... ఏ ఏకాంత సంధ్యా సమయంలోనో అది గుబులు గుబులుగా విచ్చుకుంటుంది.

మాష్టారింట్లో ది అదర్ సైడ్ ఆఫ్ లైఫ్ అనేదాన్ని నేను రుచి చూశాను. ఆ జీవితం గురించి నాకు తెలియకుండా ఉంటే ఆల్ ఈజ్ వెల్ విత్ ది వరల్డ్ అనుకుంటూ సంతోషంగా నిశ్చింతగా ఉండిపోయేవాడినేమో. కానీ అది రుచి చూసిన తర్వాత నా జీవితంలోని అరుచి ఏంటో నాకు తెలిసి వచ్చింది. ఏ అరుచి నన్ను అశాంతికి గురిచేస్తోందో అది కూడా తెలుసుకున్నాను. ఇన్నాళ్లు నన్ను నేనే భ్రమింప చేసుకున్నాను ఇదే జీవితం అంటే అని. కానీ భ్రమ ఎల్లకాలం ఉండదు.

"నీ పక్కనున్న వాళ్లకు అందకుండా నీకు అందేదేదీ నీకు నిజమైన సౌఖ్యాన్ని ఇవ్వదు. అది అశాంతినే ఇస్తుంది," మాష్టారు ఎప్పుడూ అంటుండేవారు.

అందమైన భార్య, ముద్దులు మూటకట్టే కూతురు, సమాజంలో ఒక హోదా కల్పిస్తున్న ఉద్యోగం- ఇవన్నీ లేని జీవితాన్ని ఇప్పుడు నేను ఊహించలేను. ఇవన్నీ ఉన్నప్పుడు నేను సంతోషంగా కూడా ఉండాలేమో. కానీ నేను సంతోషంగా లేను. సంతోషాన్ని పైపూతగా పూసుకుని తిరుగుతున్న నిశ్శబ్ద దుఃఖంలా ఉన్నాను. ఏదో వెలితి. ఏదో శూన్యం. ఏదో అసంతృప్తి. నాదికాని జీవితాన్ని ఏదో నేను జీవిస్తున్న భావన.

మాష్టారిని చూసిన తర్వాత నేను మర్చిపోయాననుకున్న గాయం తిరిగి రేగింది. ఇది నా జీవితం కాదు. నాది అవాల్సిన ఆ ఇంకో జీవితం ఇప్పుడిక నాకు అందదు. ఆ జీవితం నాకు ఏం అందిచ్చేదో తెలీదు. అది అందివ్వగలిగినదేదో ఇప్పుడు నా అశాంతికి కారణమవుతోంది. ఎందరో తృణప్రాయంగా ఎంచి వదిలేసిన దానిని నేను కిరీటంలా తలపై మోస్తున్నాను. ఆ అవమానభారం నన్ను మాష్టారి ముందు తల దించుకునేలా చేస్తోంది.

"అవునూ... అంత హఠాత్తుగా మాయమైపోయావు. ఏమయ్యావు?" అంత వరకూ ఏ ప్రశ్న వస్తుందని భయపడుతున్నానో, ఏది అడగకూడదని అనుకుంటున్నానో ఆ క్షణం రానే వచ్చింది.

ఏమయ్యాను? యుద్ధానికి భయపడి యుద్ధం కూడా మొదలెట్టక ముందే పారిపోయాను. రిస్కులు లేని భద్ర జీవితంలోకి సేఫ్ జోన్‌లోకి పారిపోయాను. మాష్టారు ఎప్పుడూ తాపత్రయపడే 'హ్యూమన్ లాట్'కు అందకుండా సురక్షితంగా ఒడ్డెక్కేశాను. కానీ అలా ఒడ్డెక్కడమే ఓడిపోవడంలాగా ఉందని మాష్టారికి ఎలా చెప్పను? మాష్టారి వెంట నడిస్తే ఏం చేయగలిగి ఉండేవాడినో తెలీదు. ఆ చేయలేనిది చేయకపోగా చేయలేకపోయానన్న బాధే నన్ను ఎక్కువగా ఇబ్బంది పెడుతోందని, మొహానికి కనబడని నల్లముసుగు వేసేసిందని ఆయనకు ఎలా చెప్పను? ఇన్నాళ్లూ నాకు నచ్చని నాతో నేను చేస్తూనే ఉన్న యుద్ధం గురించి ఆయనకు ఏం చెప్పను? ఇరవై ఒకటో వాడిలాగా ఉండలేనితనాన్ని ఎప్పటికీ మోస్తూనే తిరగక తప్పని దుఃఖాన్ని ఆయనకి ఎలా చెప్పను?

కానీ చెప్పక తప్పదు. ఇప్పుడు చెప్పకపోతే ఇంక ఎప్పటికీ చెప్పలేను. కన్ఫెషన్ ఇవ్వడానికి సిద్ధమై మాష్టారి ముందు తలొంచి కూర్చున్నాను...

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*14 జనవరి 2018*

*



జి. లక్ష్మి 28 జూన్ 1962న కృష్ణాజిల్లా గుడివాడలో జన్మించారు. మొదటి కథ *గుండెచప్పుడు* ఆంధ్రప్రభ వారపత్రికలో 1989లో అచ్చయ్యింది. పూలుపూయని నేల, అభయారణ్యం కథాసంపుటాలు ప్రచురించారు. ఒక నవల, మూడు కథాసంపుటాలు అనువాదం చేశారు. ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం.

**చిరునామా: 74-30-2, అశోక్‌నగర్, విజయవాడ.**

***ఫోన్: 94907 35322 guttalakshmi62@gmail.com***